బలగం
BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ మంగళవారం 28 అక్టోబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4

## అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశం కోసం దరఖాస్తులు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఎంజేపీ ద్వారా పీజేటీఏయూ అనుబంధ కళాశాలలో (బీఎస్సీ) అగ్రికల్చర్ కోర్స్‌లో ప్రవేశం కోసం ఈ నెల 21 నుంచి 29 వరకు ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల గురుకుల విద్యాసంస్థల సొసైటీ (ఎంజేపీ) కార్యదర్శి బడుగు సైదులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకోవటానికి రెండు రోజులే గడువు ఉందనిఆ కోర్సులో ప్రవేశం కోసం ఇంటర్ (బైపీసీ), దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణతతో పాటు తెలంగాణ స్టేట్ టీజీ ఈఏపీసెట్–2025 పరీక్షలో అర్హత సాధించిన వెనుకబడిన తరగతుల విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే గ్రామీణ ప్రాంతంలో వార్షిక ఆదాయం రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతలో వార్షిక ఆదాయం రూ. రెండు లక్షలకు మించకూడదని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు https://mjptbcwreis.telangana.gov.in, https://www.pjtau. edu.in వెబ్‌సైట్‌లను సందర్శించాలని పేర్కొన్నారు. దరఖాస్తు రుసుము రూ.1,000 ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే ద్వారా చెల్లించాలనీ, అవసరమైన అన్ని ధ్రువపత్రాలను దరఖాస్తుతో పాటు అప్‌లోడ్ చేయాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు ఆఫీస్ పని దినాల్లో ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు 040–23328266ను సంప్రదించాలని కోరారు. mjpadmissioncell@gmail.comకు మెయిల్ చేయాలని సూచించారు.

## డిజిటల్ అరెస్టు భయంకరమైన ప్రమాదం

- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజలను బెదిరింపులకు గురి చేస్తూ..భారీ మొత్తంలో డబ్బును కాజేస్తుండడంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ అరెస్టును ప్రజలకు ఉన్న అత్యంత భయంకరమైన ప్రమాదాల్లో ఒకటిగా పేర్కొన్నారు. ఇటువంటి వాటిని ఎదుర్కోవాలంటే సైబర్ నేరాలపై ప్రజలకు పోలీసులు సరైన అవగాహన కల్పించాలన్నారు. పోలీసుల పట్ల ప్రజలకు భయం ఉండకూడదని, వారు తమకు రక్షణగా నిలుస్తారనే గౌరవం ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్రపతి భవన్‌లో ప్రొబేషనరీ ఐపీఎస్‌లను ఉద్దేశించి ప్రసంగించిన ముర్ము ఈ వ్యాఖ్యలు చేశారు.

సైబర్ నేరగాళ్లు వీడియో కాల్స్ చేసి..తాము పోలీసులమని బెదిరిస్తారని.. తాము చెప్పినట్లు చేయకపోతే డిజిటల్ అరెస్టు చేస్తామని భయపెడతారని ద్రౌపదీ ముర్ము అన్నారు. ఇటువంటి సమయాల్లో ప్రజలు చాకచక్యంగా వ్యవహరించి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ డిజిటల్ అరెస్టు ప్రభావం పోలీసు వ్యవస్థపైనా అధికంగా ఉంటుందన్నారు. సైబర్ నేరగాళ్లు పోలీసుల మాదిరి ప్రజలను నమ్మించి మోసం చేయడంతో.. అసలైన పోలీసులు ఎవరనే విషయాన్ని కూడా వారు గ్రహించలేకపోతారన్నారు. దీనిని నివారించాలంటే సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, పోలీసులు నూతన సాంకేతికతపైనా పట్టు సాధించాలని సూచించారు.

### సీజేఐపై దాడి కేసు..
## ఇలాంటి ఘటనలు విస్మరించడమే సమాధానం

- సుప్రీంకోర్టు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన న్యాయవాది రాకేష్ కిషోర్‌పై చర్యలకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఇలాంటి ఘటనలను విస్మరించడం ద్వారానే వాటికి తగిన సమాధానం చెప్పినట్లుగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేసింది. అయితే సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) ఈ అభిప్రాయాన్ని తిరస్కరించింది. ఎటువంటి చర్యలు తీసుకోకుండా దాడి చేసిన న్యాయవాదిని విడుదల చేయడం వలన సుప్రీంకోర్టు ఒక జోక్‌గా మారిపోతుందని పేర్కొంది. ఈ దాడి కేసుపై సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ కేసుపై సుప్రీంకోర్టు తీసుకునే ఏ చర్య అయినా పరిస్థితిని మరింత దిగజార్చుతుందని, రాకేష్ కిషోర్‌కు మరింత ప్రాచుర్యం వస్తుందని, మీడియా, సోషల్‌మీడియాలో ఈ దాడి గురించి మరింత విస్తృతంగా వార్తలు వస్తాయని ధర్మాసనం పేర్కొంది. ఈ దాడిని 'అద్భుతమైన ఉదారత'తో గవాయ్ క్షమించారని ధర్మాసనం గుర్తు చేసింది. ఈ దాడిని సీజేఐ విస్మరించిన తరువాత మరొక బెంచ్‌కు లేదా, అటార్నీ జనరల్ ధిక్కార చర్యలకు అనుమతి ఇవ్వాలా..? అని ధర్మసనం ప్రశ్నించింది. అయితే ఎస్‌సీబీఏ తరుపున హాజరైన సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్, న్యాయవాది ప్రగ్యా బాఘెల్ ధర్మాసనం వ్యాఖ్యలను అంగీకరించలేదు. రాకేష్ కిషోర్ నిరంతర ధిక్కార వైఖరిని కలిగిఉండే వ్యక్తని తెలిపారు. ఈ దాడిని సీజేఐ క్షమించినా కిషోర్ తన చర్యలకు ఎలాంటి పశ్చాత్తాపం చూపలేదని, ఇందుకు బదులుగా తన దాడి చర్యను పదేపదే కీర్తించుకున్నాడని, పైగా 'మళ్లీ అలా చేస్తాను' అని చెప్పాడని గుర్తు చేశారు. దీంతో ఈ కేసు విచారణను వారం రోజుల తరువాతకు ధర్మాసనం వాయిదా వేసింది.

## 12 రాష్ట్రాలు, యూటీల్లో రెండో దశ సవరణ ప్రక్రియకు సిద్ధం

- 51 కోట్ల ఓటర్ల జాబితా ఖరారు
- పారదర్శకతే లక్ష్యం
- సిఇసి జ్ఞానేష్ కుమార్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

దేశ వ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ (సర్) రెండో దశ చేపట్టడానికి కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. ఈ ప్రక్రియలో భాగంగా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నవంబర్ నుండి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు సవరణలు జరగనున్నాయని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేష్ కుమార్ సోమవారం వెల్లడించారు. నిర్ణీత ప్రకటన ప్రకారం తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, అండమాన్ నికోబార్ దీవులు, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా సవరణలు చేపడతామని తెలిపారు.

**ఫిబ్రవరి 7న తుది జాబితా విడుదల**

ఈ సవరణ ప్రక్రియ నవంబర్ 4న ప్రారంభమై డిసెంబర్ 4వరకు ఎన్యూమరేషన్ జరగనుంది. డిసెంబర్ 9న ముసాయిదా జాబితాను విడుదల చేస్తారు. అభ్యంతరాలు, సవరణలు స్వీకరించిన తరువాత వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న తుది ఓటర్ల జాబితాలు (%ఖీజుక్ష్మ%) ప్రకటించనున్నట్లు సిఇసి జ్ఞానేష్ తెలిపారు.

**51 కోట్ల ఓటర్ల హక్కు నిర్ధారణ**

రెండో దశ సర్ పరిధిలో దేశ వ్యాప్తంగా 51 కోట్ల మంది ఓటర్ల హక్కులు ఖరారు కానున్నాయి. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరిస్తారని ఆయన వివరించారు.

"ఓటు హక్కు న్యాయంగా అర్హులకే అందేలా చేయడమే మా ప్రధాన ఉద్దేశం. సర్ ప్రక్రియలో పారదర్శకతను కాపాడుతాం," అని సిఇసి జ్ఞానేష్ కుమార్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అస్సాంలో ప్రత్యేకంగా పౌరసత్వ చట్టం నిబంధనల పరిధిలోనే సవరణలు చేపడతామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో సర్ ప్రక్రియపై సిఎంలు స్టాలిన్, మమతా బెనర్జీలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో, "మాకు రాష్ట్ర ప్రభుత్వాలతో ఎటువంటి విభేదాలు లేవు" అని సిఇసి స్పష్టం చేశారు.

**రాష్ట్రాలకే సిబ్బంది బాధ్యత**

సవరణల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వాలు తగిన సిబ్బందిని కేటాయించాల్సి ఉంటుందని చెప్పారు. కేరళలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ రాకపోవడంతో, అక్కడ సర్ నిలిపివేయాల్సిన అవసరం లేదని తెలిపారు. "సర్ ప్రధాన ఉద్దేశం విదేశీ అక్రమ వలసదార్లు ఓటర్ల జాబితాలో చేరకుండా నిరోధించడం," అని సిఇసి జ్ఞానేష్ తెలిపారు. పుట్టిన స్థలాల తనిఖీలు, ప్రాంతాల వారీగా ధృవీకరణలతో పారదర్శకంగా సవరణలు పూర్తిచేస్తామని ఆయన పేర్కొన్నారు.

### ప్రశాంతంగా మద్యం షాపుల లాటరీ ప్రక్రియ

వివరాలు 2వ పేజీలో

## ఆ 11 మంది అభ్యర్థులకు వెయిటేజీ మార్కులు

- హైకోర్టు ఆదేశం



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

స్టాఫ్ నర్సుల పోస్ట్ పరీక్షలకు హాజరైన వాళ్లలో కోర్టుకు వచ్చిన 11 మంది అభ్యర్థులకు వెయిటేజ్ మార్కులు కలపాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. వెయిటేజ్ మార్కులు కలిపిన అనంతరం పిటిషనర్లు ఉద్యోగాల భర్తీకి అర్హత సాధిస్తే గతంలో ఆదేశించిన మేరకు ఖాళీగా ఉంచి 11 పోస్టుల్లో వాళ్లను నియమించాలని సూచించింది. స్టాఫ్ నర్సుల పోస్టులను భర్తీ చేయకుండా 11 పోస్టులను ఖాళీగా ఉంచాలని గత జనవరిలో మధ్యంతర ఆదేశాలను జారీ చేశామని పేర్కొంది. వెయిటేజ్ మార్కులు కలిపాక పిటిషనర్లు అర్హత పొందితే వాళ్లను ఆ పోస్టుల్లో నియమించాలని వైద్య, ఆరోగ్య సర్వీసెస్ నియామక బోర్డును ఆదేశించింది. నోటిఫికేషన్‌లో పేర్కొన్న ఓఎంఆర్ విధానానికి బదులు కంప్యూటరీకరణ ద్వారా పరీక్ష పెట్టి పోస్టుల భర్తీ ప్రక్రియను నిర్మల మరో 11 మంది వేసిన పిటిషన్లపై జస్టిస్ ఎన్. రాజేశ్వరరావు ఇటీవల తుది ఉత్తర్వులు జారీ చేశారు. పిటిషన్లపై విచారణను క్లోజ్ చేశారు.

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని భూదాన్, గైరాన్ భూములను ఐఏఎస్/ఐపీఎస్ అధికారులు, వాళ్ల కుటుంబసభ్యుల పేరిట రిజిస్ట్రేషన్లు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో దీనిపై దర్యాప్తు చేయాలని ఈడీ పోలీసులకు రాసిన లేఖపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. దీనికి సంబంధించిన బాధ్యులపై చర్యలు ఏం తీసుకున్నారో చెప్పాలని కోరింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) లేఖ ఆధారంగా పోలీసులు ఏం చేయబోతున్నారో తదుపరి విచారణ నాటికి తెలియజేయాలంది.విచారణ నవంబర్ మూడో తేదీకి వాయిదా వేసింది. సర్వే నెంబర్ 181లోని కొంత భూమిపై యాజమాన్య హక్కు ఉందని దస్తగిర్ షరీఫ్ వేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ సోమవారం విచారించారు. ఆరో పణలు ఎదుర్కొంటున్న వారంతా ప్రభుత్వంలో ఉన్న తాధికారులుగా ఉన్నారనీ, తప్పుడు పత్రాలు, ఫోర్జరీలతో భూదాన్ బోర్డు భూమిని కాజేసే ప్రయత్నాలను అడ్డుకోవాలని పిటిషనర్ వాదన. ఈడీ లేఖపై పోలీసులు ఏం చేయబోయేదీ తెలు సుకుని వివరాలు చెప్పేందుకు గడువు కావాలని ప్రభుత్వం కోరింది. దీంతో విచారణ వచ్చే వారానికి వాయిదా పడింది.

### ధాన్యం, పత్తి, మొక్కజొన్న
# కొనుగోళ్లపై అప్రమత్తంగా ఉండాలి

- వర్ష సూచనల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి
- కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు తరలింపు:
- ఉన్నతాధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశం



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో వర్ష సూచనల నేపథ్యంలో ధాన్యం, పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లపై అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులకు నష్టం జరగకుండా కొనుగోళ్లు జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. సీఎం ఆదేశాలతో సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, సంబంధిత ఉన్నతాధికారులతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మొంథా తుపాను ప్రభావం తెలంగాణపై ఉండే అవకాశముండటంతో అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులను పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. వానాకాలం ధాన్యంతో పాటు మొక్కజొన్న పంటలు దెబ్బతినకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు నష్టపోకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని అందుబాటులో ఉన్న టార్పాలిన్‌లను వినియోగించి చెడిపోకుండా చూడాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సత్వరమే మిల్లులకు తరలించేందుకు అవసరమైన రవాణా వసతి ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాబోయే 30 నుంచి 45 రోజుల వరకు ధాన్యం కొనుగోళ్లలో అధికార యంత్రాంగం సమిష్టిగా పని చేయాలని ఆదేశించారు. అకాల వర్షాలు సంభవిస్తున్న నేపథ్యంలో వరి కోతలు నిలిపేస్తే రైతులకు ఇబ్బంది ఉండదని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 8,342 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో ఇప్పటికే 4,428 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. మిగిలిన 3,814 కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలన్నారు. సోమవారం నాటికి 22,433 మంది రైతుల నుంచి 1,80,452 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. అందులో దొడ్డు రకం 73,628 మెట్రిక్ టన్నులు, సన్నాలు 1,06,824 మెట్రిక్ టన్నులున్నాయనీ, వాటి విలువ రూ.431.09 కోట్లు అని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యానికి త్వరితగతిన చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ జరపాలనీ, కొనుగోలులో రైతులకు ఎక్కడా ఆటంకాలు కలుగకుండా చూడాలని అన్నారు. కేంద్రాలను ఎప్పటికప్పుడు కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖాధికారులు సందర్శించి అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు.

**అవినీతి ఉపేక్షించం**

ధాన్యం కొనుగోలు సమయంలో అవినీతి చోటు చేసుకుంటే ఉపేక్షించేది లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. అవినీతి ఆరోపణలు వస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ఈ తరహా ఆరోపణలకు తావు లేకుండా చూడాలని ఆదేశించారు. తమ ప్రభుత్వం రైతుపక్షపాత ప్రభుత్వమని గుర్తుచేశారు. ఏ కారణం చేతనైనా సరే .. రైతులకు నష్టం వాటిల్లితే ప్రభుత్వం చూస్తూ ఊరుకోబోదని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, కమిషనర్ గోపి, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, డైరెక్టర్ హనుమంతు కొండుబా, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీ బాయి పాల్గొన్నారు.

## పత్తిలో తేమ 12 శాతం మించకుండా చూసుకోవాలి



- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో పౌరసరఫరాల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లు, కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని నేలపై ఉంచవద్దని, తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు.

పత్తి అమ్మకాల విషయంలో రైతులు నాణ్యత, తేమశాతంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మార్కెట్‌యార్డుకు లేదా జిన్నింగ్ మిల్లుకు తీసుకువెళ్లే ముందు పత్తిలో తేమ శాతం 12 శాతం మించకుండా చూసుకోవాలని తెలిపారు. 12 శాతం మించితే కనీస మద్దతు ధర పొందే అవకాశం ఉండదని స్పష్టం చేశారు.

తాజా వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తేమ శాతం ఎక్కువ ఉన్నా పత్తి పంట కొనుగోలు చేయాలని కేంద్రాన్ని ఒత్తిడి చేస్తున్నామని మంత్రి తుమ్మల వెల్లడించారు. ఈ విషయంపై నిన్న (ఆదివారం) కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ చౌహాన్కు లేఖ రాశామని గుర్తుచేశారు.రాష్ట్ర ప్రభుత్వం పత్తి రైతులకు గరిష్ఠ మద్దతు ధర అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. కేంద్రం నుంచి అనుమతులు వచ్చేవరకు రైతులు పత్తిలో తేమ శాతం 12 శాతం మించకుండా చూసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కేంద్రం ప్రైస్ సపోర్ట్ స్కీమ్ కింద పంటల కొనుగోలుకు వెంటనే అనుమతులు ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్తో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ తెలంగాణలో పెసర, మినుము పంటలను వందశాతం వరకు, సోయాబీన్‌ను 50 శాతం వరకు కనీస మద్దతు ధర కింద కేంద్రం కొనుగోలు చేయాలని కోరారు. అదేవిధంగా మొక్కజొన్న, జొన్న పంటలను కూడా PSS పథకంలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. రైతుల ప్రయోజనాల కోసం కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన విన్నవించారు.



## తదుపరి సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్
### కేంద్రానికి సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ సిఫారసు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

సోమవారం కేంద్రానికి సిఫారసు చేశారు. జస్టిస్ సూర్యకాంత్ పేరును ఒక లేఖలో కేంద్ర న్యాయశాఖ మంత్రికి ఆయన తెలియజేశారు. నిబంధనల ప్రకారం సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తిని సీజేఐ పదవికి ఎంపిక చేస్తారు. ప్రస్తుతం అత్యున్నత న్యాయస్థానంలో జస్టిస్ సూర్యకాంత్ సీనియర్ మోస్ట్ న్యాయమూర్తిగా ఉన్నారు. జస్టిస్ బిఆర్ గవాయ్ నవంబర్ 23న ఉద్యోగ విరమణ చేయనున్నారు. దీంతో నవంబర్ 24న దేశ 53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు చేపడతారు. 2027 ఫిబ్రవరి 9 వరకూ 15 నెలల పాటు ఆయన ఈ పదవిలో ఉంటారు. ఆయన సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించి నప్పటి నుంచి ఇప్పటి వరకు 300 ధర్మాసనాల్లో భాగంగా ఉన్నారు.

## మైనార్టీలను కాంగ్రెస్ ఓటు బ్యాంక్‌గా చూస్తోంది

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రెండేళ్ల క్రితం మైనార్టీల కోసం నాలుగు వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని, మైనార్టీ సబ్‌ప్లాన్ తెస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) విమర్శించారు. శంషాబాద్‌లో బీఆర్ఎస్ మైనార్టీ నేతలతో జరిగిన సమావేశంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు.

"పెద్ద పెద్ద లీడర్లను తెచ్చి కృడ మైనార్టీ డిక్లరేషన్ ప్రకటించారు. మార్పు తెస్తామన్నారు. కానీ రెండేళ్లు గడిచినా చేయింది ఏమీ లేదు. ఇంకో మూడేళ్లలో కూడా వీళ్లతో ప్రయోజనం ఉండదు," అని కేటీఆర్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. షాదీ ముబారక్ పథకం, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్ వంటి పథకాలను సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. "నాలుగు ఉన్న మెడికల్ కాలేజీలు 34కు పెరిగాయి. విద్యార్థులకు 20 లక్షల స్కాలర్‌షిప్‌లు ఇచ్చాం. పదేళ్లలో ఎన్నో పనులు చేశాం," అని వివరించారు.

"మేం కొన్ని పొరపాట్లు చేసి ఉంటే చేసుండొచ్చు. కానీ దేశంలో మైనార్టీల కోసం కేసీఆర్ చేసినంత పనులు ఎవరూ చేయలేదు," అన్నారు కేటీఆర్. తెలంగాణలో 45 లక్షల మంది ముస్లింలు ఉన్నారని, వారిపై ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఖర్చు చేశారని తెలిపారు. "యూపీలో బుల్డోజర్ రాజ్యమని విమర్శించే రాహుల్ గాంధీ, ఇక్కడ బుల్డోజర్ రాజ్యం నడుస్తుంటే ఎందుకు సైలెంట్‌గా ఉన్నాడు?" అని కేటీఆర్ ప్రశ్నించారు. "రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ సహా పది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారారు. వాళ్లను మీరు ఏ పార్టీలో ఉన్నారని అడిగితే సమాధానం చెప్పలేరు," అని ఎద్దేవా చేశారు.

రేవంత్ రెడ్డి రెండు సంవత్సరాల్లో చేసిన పని ఒక్కటే "కేసీఆర్ పేరు తీయడం, ఆయనను గుర్తు చేసుకోవడం మాత్రమే," అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. "మోదీ స్కూల్లో చదివానని, చంద్రబాబు కాలేజీకి వెళ్లానని, రాహుల్ దగ్గర ఉద్యోగం చేస్తున్నానని రేవంత్ బహిరంగంగానే చెబుతున్నాడు," అన్నారు.

"మోదీని 'చౌకీదార్ చోర్' అంటున్న రాహుల్ గాంధీకి రేవంత్ మాత్రం ఆయన నా పెద్దన్న అంటున్నాడు," అని కేటీఆర్ వ్యంగ్యంగా అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ సీబీఐ విచారణకు అప్పగిస్తామని రేవంత్ చెప్పినా, "తన బంధువులకు కేంద్రంలో కాంట్రాక్టులు రావడం, బీజేపీ నేతలకు లాభాలు చేకూర్చడం" జరుగుతోందని ఆరోపించారు. కేటీఆర్ మాట్లాడుతూ, "మైనార్టీలను ఓటు బ్యాంక్‌గా చూడడం కాంగ్రెస్ పార్టీకి అలవాటైపోయింది. కానీ కేసీఆర్ ప్రభుత్వం మైనార్టీలను సమాన పౌరులుగా గౌరవించింది. వారి సంక్షేమానికి నిజమైన నిధులు కేటాయించింది," అని అన్నారు.



## ఆర్టీసీ బస్సు ఢీకొని 15 గొర్రెలు మృత్యువాత

- మెదక్ జిల్లాలో ఘటన

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మెదక్ జిల్లా కొల్చారం మండల కేంద్రం లోతువాగు ప్రాంతంలో నర్సాపూర్ నుంచి మెదక్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అతి వేగంగా గొర్రెల మంద పైకి దూసుకెళ్లింది. దాంతో 15 గొర్రెలు అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. మరికొన్ని తీవ్రంగా గాయపడ్డాయి. ప్రమాదం జరిగిన వెంటనే బస్సు డ్రైవర్ వాహనాన్ని ఆపి దిగిపోగా, సంఘటనా స్థలంలో కొంతసేపు ఆందోళన నెలకొంది. రోడ్డు మధ్యలో మృత్యువాత పడిన గొర్రెలు, గాయపడినవి పడి ఉండటంతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. ప్రయాణికులు, స్థానికులు సంఘటన చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. సమాచారం అందుకున్న కొల్చారం పోలీసులు తక్షణమే ఘటనాస్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మృతి చెందిన గొర్రెల యజమాని ఆ దృశ్యం చూసి బోరున విలపించాడు. మహబూబ్‌నగర్ నుంచి బతుకుదెరువు కోసం గొర్రెలు మేపడానికి వస్తే అవి మృత్యువాత పడ్డాయని కన్నీటి పర్యంతమయ్యాడు.

## మొంథా తుపాన్ ప్రభావం.. దక్షిణ మధ్య రైల్వే కీలక సూచనలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాన్ ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ సహా తూర్పు తీర రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.మంగళవారం నాటికి ఈ తుపాన్ మచిలీపట్నం – కాకినాడ మధ్య తీరం దాటే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించింది. ఈ ప్రభావంతో భారీ ఈదురుగాలులు, మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హెచ్చరించింది. తుపాన్ తీవ్రత దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే పలు జాగ్రత్త చర్యలు చేపట్టింది.

తుపాన్ ప్రభావం నేపథ్యంలో రైళ్ల రాకపోకల్లో అంతరాయం కలిగే అవకాశం ఉందని రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికులు తప్పనిసరి అయితేనే ప్రయాణం చేయాలని సూచించారు. విజయవాడలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి రైళ్ల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. తుపాన్ తీవ్రతను బట్టి కొన్ని రైళ్లు రద్దు లేదా మార్గమార్పు చేయవచ్చని పేర్కొన్నారు.ప్రయాణికులు స్టేషన్‌కు బయలుదేరే ముందు రైళ్ల స్టేటస్ తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు.


**రైల్వే కంట్రోల్ రూమ్ నంబర్లు**

తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక హెల్ప్‌లైన్‌లు ఏర్పాటు చేసింది:

గూడూరు – 08624–250795
నెల్లూరు – 9063347961
ఒంగోలు – 7815909489
బాపట్ల – 7815909329
తెనాలి – 7815909463
విజయవాడ – 0866–2575167
ఏలూరు – 7569305268
రాజమండ్రి – 8331987657
సామర్లకోట– 7382383188
తుని – 7815909479
అనకాపల్లి – 7569305669
భీమవరం – 7815909402
గుడివాడ – 7815909462

ఆన్‌లైన్ ద్వారా సమాచారం తెలుసుకోండి

ప్రయాణికులు ఎన్‌టీఈఎస్ మొబైల్ యాప్, లేదా వెబ్‌సైట్ https://enquiry.indianrail.gov.in ద్వారా రైళ్ల తాజా సమాచారాన్ని తెలుసుకోవచ్చు.



## కాకినాడకు రెడ్ అలర్ట్

- శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు వర్షాలు
- విశాఖకు ఇండిగో, ఎయిర్ ఇండియా విమానాలు రద్దు
- అల్లూరిలో పర్యాటక ప్రాంతాలు మూసివేత

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మొంథా తుపాను నేపథ్యంలో శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. కాకినాడ, ఏలూరు, విశాఖ, శ్రీకాకుళంలో సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. కాకినాడ వద్ద తీరం దాటే అవకాశం ఉన్నందున కాకినాడకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. సముద్ర తీరం వెంబడి ఈదురు గాలులు బలంగా వీస్తున్నాయి. మత్స్యకారులెవ్వరూ వేటకు వెళ్లరాదని అధికారులు

మిగితా 4వ పేజీలో

# ప్రశాంతంగా మద్యం షాపుల లాటరీ ప్రక్రియ




**బలగం టీవీ, హైదరాబాద్**

మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిం ది. రాష్ట్రవ్యాప్తంగా 2,620 దుకాణాలకు వచ్చిన 95,137 దరఖాస్తులను 34 కేంద్రాల్లో జిల్లా కలెక్టర్ల సమక్షంలో డ్రా తీసి 2,601 షాపులను కేటాయించారు. వివిధ కారణాలతో 19 దుకాణాల లాటరీ నిలిపివేశారు. మండలం, జిల్లా, మున్సిపాల్టీ, కార్పొరేషన్ పరిధిలో షాపులు దక్కించుకున్న వారు రెండ్రోజుల్లో నిర్దేశిత లైసెన్స్ ఫీజులో మొదటి విడుత చెల్లించి కన్ఫర్మేషన్ లెటర్ పొందాలని అధికారులు పేర్కొన్నారు. కొత్త షాపులు డిసెంబర్ ఒకటి నుంచి అందుబాటులోకి రానున్నాయని, 2027 నవంబర్ 30 వరకు రెండేండ్లు వీటి కాలపరిమితి ఉంటుందని తెలిపారు. 2023లో 1.32 లక్షల దరఖాస్తులు రాగా ఈసారి 37 వేలకుపైగా తగ్గాయి. దరఖాస్తు ఫీజును రూ.2 లక్షల నుంచి రూ.3లక్షల వరకు పెంచడంతో పాటు పలు చోట్ల వ్యాపారులు సిండికేట్ కావడంతో తక్కువ అప్లికేషన్లు వచ్చినట్టు భావిస్తున్నారు. దరఖాస్తులు తగ్గినా ఫీజు పెంపుతో గతం కంటే రూ.200 కోట్ల వరకు అధికంగా ఆదాయం వచ్చింది. దరఖాస్తుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలిస్తే మూడొంతులకు పైగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి దాని చుట్టు పక్కల ప్రాంతాల నుంచే రావడం గమనార్హం.

వివిధ కారణాలతో నిలిచిపోయిన 19 మద్యం దుకాణాలకు డ్రా ను నవంబర్ 3న నిర్వహించనున్నట్టు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణకు ఎక్సైజ్ శాఖ ఈనెల 28న నోటిఫికేషన్ విడుదల చేయనుంది. నవంబర్ ఒకటి వరకు ఐదు రోజుల పాటు దరఖాస్తులు స్వీకరిస్తారు. నిలిచిపోయిన వాటిలో ఆసిఫాబాద్ జిల్లాలో 7, ఆదిలాబాద్ జిల్లాలో 6, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 2, శంషాబాద్ ఎక్సైజ్ జిల్లాలో 3, సంగారెడ్డి జిల్లాలో ఒక షాపు ఉన్నాయి.

## యువ నటుడు సచిన్ చాంద్‌వడే ఆత్మహత్య

**‘జాంతాడా 2’ వెబ్ సిరీస్‌తో గుర్తింపు పొందిన బాలీవుడ్ నటుడి మృతి**




**బలగం టీవీ, హైదరాబాద్**

బాలీవుడ్‌లో విషాదం నెలకొంది. యువ నటుడు సచిన్ చాంద్‌వడే (25) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహారాష్ట్రలోని ఉందిర్‌ఖేడ్ ప్రాంతంలో తన నివాసంలోనే సచిన్ ఈ నెల 23న ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో మరుసటి రోజు మరో ఆస్పత్రికి మార్చినప్పటికీ ఫలితం లేకుండా 24న సచిన్ చికిత్స పొందుతూ మరణించాడు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు సచిన్ ఆత్మహత్య వెనక గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియాల్సి ఉంది. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా కెరీర్ ప్రారంభించిన సచిన్ నటనపై ఆసక్తితో సినీ రంగంలోకి అడుగుపెట్టాడు. ‘జాంతాడా 2’ వెబ్ సిరీస్ ద్వారా గుర్తింపు పొందాడు.

# సీఐటీయూ జిల్లా మహాసభల విజయవంతం చేయాలి

**మహాసభల కరపత్రం ఆవిష్కరణ..**

**బలగం టీవీ, బోయినిపల్లి:**

శ్రామిక వర్గా హక్కుల సీఐటీయూ జిల్లా 4వ. మహాసభల విజయవంతానికి ఆర్థిక సహకారాలు అందించి సహకరించాలని,అక్టోబర్ 29, 30 తేదీలలో రాజన్న సిరిసిల్లలో జరిగే సిఐటియు జిల్లా 4వ,మహాసభల కరపత్రం ఆవిష్కరించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కో రెం గ్రామంలో సిఐటియు పక్షాన హమాలి కార్మికుల ఆధ్వర్యంలో జిల్లా సిఐటియు కమిటీ సభ్యులు గురిజాల శ్రీధర్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గురిజాల శ్రీధర్ మాట్లాడుతూ.. జిల్లాలో కార్మిక వర్గం, కష్టజీవులు ఎదుర్కొంటున్న సమస్యలు అదేవిధంగా ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై, పెట్టుబడిదారుల దోపిడీకి వ్యతిరేకంగా కార్మిక వర్గం పక్షాన నిలబడి అనేక సంవత్సరాలుగా కార్మికుల హక్కుల సాధనకై అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తూ, కార్మికుల హక్కులను కాపాడుతున్న ఏకైక సంఘం సిఐటియుఅని, అటువంటి సిఐటియు 4వ, మహాసభలు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో రెండు రోజులపాటు అక్టోబర్ 29,30 తేదీలలో నిర్వహించడం జరుగుతుందని, కార్మిక వర్గ ఐక్యతను చాటే విధంగా వేలాదిమంది కార్మికులతో భారీ ర్యాలీ–ప్రదర్శన బహిరంగ సభ నిర్వహించి,భోజనాలు ఏర్పడి చేయడం జరుగుతుంది. ఈ మహాసభలకు సిఐటియు రాష్ట్ర నాయకత్వం హాజరవుతారని, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేసిన పోరాటాలను ఉద్యమాలను సమీక్షించుకొని



రాబోయే రోజుల్లో భవిష్యత్తు పోరాట కార్యచరణ రూపొందించుకొని నూతన కమిటీని ఎన్నుకోవడం జరుగుతుంది. మహాసభలకు జిల్లాలోని పవర్లూమ్ కార్మికులు, బీడీ కార్మికులు, హమాలి కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, గ్రామపంచాయతీ మరియు మునిసిపల్ కార్మికులు, ఆశ, అంగన్వాడి, మధ్యాహ్న భోజనం కార్మికులు, హాస్పిటల్ మరియు విద్యుత్ సంస్థలో చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు,మిత్రులు, శ్రేయోభిలాషులు, ఉద్యోగ ఉపాధ్యాయులు, వాణిజ్య వ్యాపారస్తులు, ప్రజా ప్రతినిధులు ప్రతి ఒక్కరూ తమ వంతు సిఐటియు మహాసభలకు హార్దిక సహాయ సహకారాలు అందించి, పోరాటాల వారది సిఐటియుకు వెన్నుదండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హమాలి సంఘం అధ్యక్షులు ఇస్తారి, శ్రీనివాస్, విలేందర్, మల్లయ్య, లచ్చయ్య, తదితరులు కార్మికులు పాల్గొన్నారు.

# రైతులు అధైర్య పడవద్దు అండగా ఉంటాం..



- **చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం**
- **సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి భరోసా**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎల్లారెడ్డిపేట ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలైన కిషన్ దాస్ పేట, కోరుట్ల పేటలను చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి సందర్శించారు. అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి మాట్లాడుతూ, తడిసిన ధాన్యం గురించి రైతులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి ధైర్యం చెప్పారు. కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. నిన్న, మొన్న కురిసిన అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని చూసి రైతులు ఏమాత్రం అధైర్యపడాల్సిన అవసరం లేదని ఎల్లారెడ్డిపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్ %–% సింగిల్ విండో) చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి భరోసా ఇచ్చారు. ప్రభుత్వం చివరి గింజ వరకు కొనుగోలు చేసేలా తమవంతు కృషి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ డైరెక్టర్ నేవూరి వెంకట నరసింహ రెడ్డి, రైతులు మేడిపల్లి భూపాల్, సడిమెల రాజం, గూడ పద్మా రెడ్డి, తాడ శ్రీనివాస్ రెడ్డి, సురభి వెంకట రామారావు, గూడూరి విభాకర్ రావు, రాజిరెడ్డి, బాధ రమేష్, సల్వాలా శ్రీనివాస్, సిరిసిల్ల దేవయ్య, దీటి నర్సయ్య, అల్లం నారాయణ, కటకం నారాయణ, దేవయ్య, నేవురి జగన్ రెడ్డి, మద్దుల రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లికి వారం ముందు విషాదం..

- **గోదావరిలో కొట్టుకుపోయిన ప్రేమ జంట..**

**బలగం టీవీ, పెద్దపల్లి**




పెద్దపల్లి జిల్లాలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. పెద్దలను ఒప్పించి మరో వారం రోజుల్లో పెళ్లి చేసుకోబోతున్న ప్రేమ జంట గోదావరి నదిలో కొట్టుకుపోయింది. నవంబర్ 1న పెళ్లి నిశ్చయించుకున్న ఈ జంట కుటుంబీకులతో పుణ్యస్నానాలకు గోదావరిఖని సమ్మక్క సారాలమ్మ పుష్కర ఘాట్ వద్దకు వచ్చారు. నదిలో స్నానం చేస్తుండగా కొట్టుకుపోయారు. గమనించిన జాలరులు యువకుడిని కాపాడి యువతి మృతదేహాన్ని వెలికితీశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అడవుల్లో నుంచి జనాల్లోకి..

- **21 మంది మావోయిస్టుల లొంగుబాటు**

**బలగం టీవీ, ఛత్తీస్‌గఢ్**

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ పరిధి కాంకేర్ జిల్లాలో నక్సలైట్ల లొంగుబాటు పరంపర కొనసాగుతోంది. తాజాగా, కీలకమైన కిస్కోడో డివిజన్ కార్యదర్శి (డీవీసీఎం) ముకేశ్ సహా మొత్తం 21 మంది సాయుధ నక్సల్స్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరి వద్ద నుంచి 18 తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. అంతఘర్‌లోని బర్రెబెడ గ్రామం నుండి ఈ సాయుధ నక్సలైట్ల బృందం గుమిగూడి వచ్చి లొంగిపోవడానికి సిద్ధమైంది. నక్సలైట్ నాయకుడు రామ్‌ధేర్ బృందానికి చెందిన వారే లొంగిపోయిన వారిలో ఎక్కువ మంది ఉన్నారు. సమాచారం అందుకున్న టాడోకి పోలీసులు ఆ నక్సలైట్లను తమ వాహనాల్లోకి ఎక్కించుకుని భానుప్రతాప్‌పూర్‌కు తరలించారు. ఈ నక్సలైట్లను జనజీవన స్రవంతిలోకి తీసుకురావడంలో పోలీసులు విజయం సాధించారు. ఇటీవల కాలంలో బస్తర్ ప్రాంతంలో నక్సల్స్ లొంగుబాట్లు పెరిగాయి. కొన్ని రోజుల క్రితం కామ్టెడా శిబిరంలో కూడా 50 మంది నక్సలైట్లు లొంగిపోయిన విషయం తెలిసిందే. ప్రభుత్వ పునరావాస విధానాలు, భద్రతా బలగాల ఒత్తిడితో నక్సలైట్లు ఆయుధాలు వీడి జనంలోకి వస్తున్నారు.

# కాంగ్రెస్ కోడ్ ఉల్లంఘనలపై బీఆర్ఎస్ ఫిర్యాదు

- **సీఎం సభ రద్దు చేయాలని డిమాండ్..**

**బలగం టీవీ, హైదరాబాద్**

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ యధేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ శాసన మండలి ప్రతిపక్ష నేత ఎస్. మధుసూదనాచారి నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రతినిధి బృందం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ)కి ఫిర్యాదు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యూసఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో సినిమా వర్కర్లకు సన్మానం పేరుతో నిర్వహిస్తున్న సభకు ఇచ్చిన అనుమతిని తక్షణమే రద్దు చేయాలని బీఆర్ఎస్ తమ పిటిషన్‌లో సీఈఓను కోరింది. ఈ సభ కొనసాగిస్తే ముఖ్యమంత్రిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌పై ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. మధుసూదనాచారితో పాటు సీఈఓను కలిసిన వారిలో కార్పొరేషన్ మాజీ చైర్మన్లు అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి, పల్లె రవికుమార్ గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కె. కిషోర్ గౌడ్ లు ఉన్నారు.



# బూదాకలాన్ శ్రీ శివాలయంలో తిలక్ వాకర్స్ ఆధ్వర్యంలో ఉచిత సామూహిక వివాహాలు..

- **నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య**

**బలగం టీవీ, బెల్లంపల్లి**

బెల్లంపల్లి మండలం, బూదాకలాన్ గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ శివాలయంలో తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బెల్లంపల్లి వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత సామూహిక వివాహ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ముఖ్యఅతిథిగా హాజరై, వివాహ బంధంలోకి అడుగుపెట్టిన నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ, బెల్లంపల్లిలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు నిరుపేద కుటుంబాల కోసం ఉచిత సామూహిక వివాహాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి మంచి కార్యక్రమాలకు తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన హామీ ఇచ్చారు. ఈ ఉచిత సామూహిక వివాహ మహోత్సవంలో బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నిరంజన్ గారు, బెల్లంపల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సుదర్శన్ గారు, బీఆర్ఎస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆరునెలల కష్టం.. అడ్డిపావు సేరుకు అమ్మకం..!

- రైతును నిట్టనిలువునా ముంచుతున్న మిల్లర్లు..
- మిల్లర్లు దోచుకుంటున్న చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

అరుగాలం చెమటోడ్చి ఎండకు, వాన కు కష్టపడి పండించిన పంటను రైతులు వరుణుడి ప్రతాపం, ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి తో అడ్డి పావు సేరుకు మిల్లార్లకు అమ్ముకోక తప్పని దుస్థితి నెలకొంది. ఇదే అదునుగా భవిస్తున్న మిల్లు యజమానులు ప్రభుత్వ ధర 2389 రూపాయలు ఉండగా 1750 రూపాయలకు ధాన్యం కొనుగోలు చేస్తూ రైతు ను దాదాపు క్వింటల్ కు 600 రూపాయల కోత విధిస్తూ నిట్టనిలువునా ముంచుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్న అధికార యంత్రాంగం మాత్రం మా సొమ్ము ఏమి పోయిందన్న చందంగా ఏసీ గదుల్లో కాలక్షేపం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఇక రైతు ప్రభుత్వం అని చెప్పుకొనే కాంగ్రెస్ నాయకులు, స్థానిక ఎమ్మెల్యే మాత్రం మిల్లు యజమానులు ఇంత దోచుకుంటున్న కనీసం పట్టించుకునే పాపాన పొవట్లేదని అన్నదాతలు బాహటంగానే విమర్శిస్తున్నారు. అదే మన పక్క మండల మిల్లు ల్లో మరి ఇంత దోపాఖం లేదని రైతులు ధాన్యన్ని రవాణా ఖర్చులు ఎక్కువ ఐన పర్లేదని అక్కడకు తరలించి విక్రయించుకుంటున్నారు. ఏది ఏమైనా ఆరుగలం కష్టపడ రైతును కనికరించి మరి ఇంతలా ముంచకుండా కొంత న్యాయం చేయాలనీ ప్రభుత్వ పెద్దలను అధికారులను రైతులు దీనంగా వేడుకుంటున్నారు.

## కేటీఆర్ చొరవతో గల్ఫ్ బాధితుడు స్వదేశానికి..



- కంపెనీ ప్రతినిధులతో మాట్లాడిన బలగం టీవీ సీఈఓ బాలు కాయితీ

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన గల్ఫ్ బాధితుడు బాలసాని గౌరయ్య ఎట్టకేలకు తన సొంతగడ్డకు చేరుకున్నారు. ఏజెంట్ మోసానికి, కంపెనీ వేధింపులకు గురై మస్కట్‌లో చిక్కుకుపోయిన గౌరయ్య మాజీ మంత్రి కేటీఆర్ (కల్వకుంట్ల తారక రామారావు) చొరవతో క్షేమంగా తిరిగిరాగలిగారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బాలసాని గౌరయ్య అలియాస్ సతీష్, మెరుగైన జీవనం కోసం కేవలం రెండు నెలల కిందట మస్కట్‌కు వెళ్లారు. అయితే, అక్కడికి వెళ్ళాక ఏజెంట్ మోసం బయటపడింది. చాలీచాలని జీతం సరిగా ఇవ్వకపోవడం, అంతకుమించి కంపెనీ యజమాని పాస్‌పోర్ట్‌ను లాక్కోవడంతో మస్కట్‌లో బాధితుడు గౌరయ్య చిక్కుకుపోయాడు. తనను ఆదుకోవాలని, ఇంటికి తిరిగి రావడానికి సహాయం చేయాలని కోరుతూ గౌరయ్య మస్కట్‌లో ఉండి ఒక సెల్ఫీ వీడియోను విడుదల చేశారు.

బాధితుడు బలగం టీవీకి కాల్ చేసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లాలని ప్రాదేయపడ్డారు. బలగం టీవీ ఈ వార్తాను ప్రసారం చేయడంతో పాటు సిరిసిల్ల శాసన సభ్యుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో మస్కట్ ఎంబసీకి కేటీఆర్ ఈ నెల 12 న లేఖ రాశారు. తన నియోజకవర్గానికి చెందిన గౌరయ్యను క్షేమంగా ఇంటికి చేరాలా చూడాలని న్యాయ సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి తోడు మస్కట్ ఓ ఉంటున్న సామాజిక సేవ కార్యకర్త షేక్ అహ్మద్ ఎంబసీ అధికారులతో కంపని ప్రతినిధులతో చర్చలు జరిపారు. బలగం టీవీ సీఈవో బాలు కాయితి సిరిసిల్ల కూడా సదరు కంపని ప్రతినిధితో మాట్లాడారు. ఎట్టకేలాకు కంపెని నిర్వహకులు ఒప్పకొని పాసుపోర్టు వాపస్ ఇచ్చారు.

ఇక వీడియోను చూసిన మంత్రి కేటీఆర్ వెంటనే స్పందించారు. ఈ నెల 12న మస్కట్ లోని భారత రాయబార కార్యాలయం (ఎంబసీ) కి లేఖ రాసి, గౌరయ్యకు సహాయం చేయాల్సిందిగా కోరారు.కేటీఆర్ చొరవతో పాస్‌పోర్ట్‌ను తిరిగి ఇప్పించారు. అంతేకాక, గౌరయ్య స్వదేశానికి తిరిగి రావడానికి అవసరమైన విమాన టికెట్ ఖర్చుతో సహా ఆర్థిక సాయంను కూడా కేటీఆర్ అందించారు. మస్కట్‌లో ఉన్న సామాజిక సేవ కార్యకర్త షేక్ అహ్మద్ కూడా ఈ ప్రక్రియలో గౌరయ్యకు ఎంతో సహాయం చేశారు. సోమవారం తెలవారుజామున గౌరయ్య హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఎయిర్‌పోర్ట్)కు చేరుకున్నారు. తన కుటుంబసభ్యులను చూసి భావోద్వేగానికి లోనై, కంటతడి పెట్టుకున్నారు. క్లిష్ట పరిస్థితుల్లో తనను ఆదుకుని, ప్రాణాలతో ఇంటికి చేర్చినందుకు గాను మంత్రి కేటీఆర్‌కు గౌరయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ఇవ్వాలి..

- మంచిగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలి
- ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్
- తంగళ్లపల్లి కేజీబీవీలో ఆకస్మిక తనిఖీ
- విద్యార్థులతో కూర్చొని పలు అంశాలపై చర్చ

**బలగం టీవీ, తంగళ్లపల్లి:**



విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ఇవ్వాలని ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ ఆదేశించారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)ను ఇంచార్జి కలెక్టర్ సోమవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్ లో ఆహార సామగ్రి, కోడి గుడ్లు, కూరగాయలు పరిశీలించారు. కోడి గుడ్లపై స్టాంప్ ఉండేలా చూసుకోవాలని ఇంచార్జి కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతోపాటు కింద కూర్చుని మెనూ ప్రకారం చికెన్, మటన్, కోడి గుడ్లు ఇస్తున్నారా అని ఆరా తీశారు. పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని వివరించారు. పర్యావరణ, భవిష్యత్ ప్రణాళికలు, అంశాలపై చర్చించారు.

ఈ సందర్భంగా విద్యాలయం ఆవరణలో 9 వ తరగతి విద్యార్థులకు బయో సైన్సులోని ఫోటో సింథసిస్పై వివరించారు. విద్యార్థులం దరూ చదువు పై శ్రద్ధ పెట్టాలని, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. తాము అనుకున్న ఉద్యోగాలు, ఉన్నత స్థానాలకు ఎదగాలని పిలుపు ఇచ్చారు. ఆర్థికంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. విద్యాలయం ఆవరణ నిత్యం పరిశుభ్రంగా ఉండాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యాలయంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని డీఈవోను ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్శనలో కేజీబీవీ ఎస్ఓ శ్యామల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మానకొండూర్ ఎమ్మెల్యేపై మాజీ ఎమ్మెల్యే ఫిర్యాదు

- అభివృద్ధి చేయడం చేతగాకే కవ్వంపల్లి కాంగ్రెస్ చెడ్డి గ్యాంగ్ తో దాడులు చేయిస్తున్నాడు..
- మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

**బలగం టీవీ, మానకొండూర్**




మానకొండూరు నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య రాజకీయ వివాదం రోజురోజుకు తీవ్రమవుతోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, తనపై దాడులు చేయిస్తున్నారని ఆరోపిస్తూ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు రసమయి బాలకిషన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అభివృద్ధి చేయడంలో విఫలమై, తనపై కాంగ్రెస్ 'చెడ్డి గ్యాంగ్'తో దాడులు చేయిస్తున్నాడని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను దూషించిన విషయమై ఆయనపై కేసు నమోదు చేయాలని కోరుతూ రసమయి బాలకిషన్ స్థానిక సీఐని కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయనతో పాటు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణ రావు గారు కూడా సీఐని కలిసి ఫిర్యాదు అందజేశారు. రసమయి బాలకిషన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివచ్చాయి. తమ నాయకుడికి మద్దతుగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ, "2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఉద్యమకారుడినైన నన్ను ఎమ్మెల్యేగా గెలిపించిన గడ్డ మానకొండూరు నియోజకవర్గము. గత పదేళ్లలో మానకొండూరు నియోజకవర్గము ఎంతో అభివృద్ధి, ప్రగతి సాధించింది," అని తెలిపారు. మానకొండూర్ నియోజకవర్గం పేరు చెప్పగానే తెలంగాణ ప్రజలు ఉలిక్కిపడి పోతున్నారని, రాష్ట్ర ప్రజలు ఛీత్కరిస్తున్నారని సంచలన ఆరోపణలు వెలువడ్డాయి. నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై ఆరోపణలు గుప్పించిన వారు, ఎమ్మెల్యే నిరాధారమైన ఆరోపణలతో కేసులు పెట్టి రాజకీయ పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. ఆయన తీరు చూస్తుంటే 'దొంగనే దొంగ అన్నట్టు' ఉందని పేర్కొన్నారు. గత సెప్టెంబర్ 28వ తేదీ రోజు జర్నలిస్టుల సాక్షిగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తనను దుర్భాషలాడినారని, ఎమ్మెల్యే కవ్వంపల్లి వైద్య విద్యలో బూతులు తిట్టడం నేర్చుకున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎవరు ఎలాంటివారో మానకొండూర్ నియోజకవర్గ ప్రజలకు బాగా తెలుసని, తన తల్లిని, భార్యను, పిల్లలను తిట్టడం, తన 'కలర్'ను కూడా ఎమ్మెల్యే దూషించడం బాధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. "గిసొంటి సంస్కారం లేని ఎమ్మెల్యే విజ్ఞతకే వదిలేస్తున్నాం" అని తెలిపారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పరువు పోతుందని నేను అమెరికా పోయిన తర్వాత నేను ఆయనను తిట్టినట్లు వీడియో తయారు చేసి పోలీస్ స్టేషన్ లో అక్రమ కేసు పెట్టించారు. మానకొండూర్ నియోజకవర్గములో బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు పెట్టిస్తున్నాడని, ఎమ్మెల్యే సంస్కారం ఎందో ఇప్పుడు ప్రజలకు తెలుస్తున్నదని అన్నారు. లారీ కింద పడి చనిపోయిన సురేష్ గౌడ్ ను కూడా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఎందుకు తిట్టినారని, ఎమ్మెల్యే నీచమైన మాటలు మాట్లాడినారని అన్నారు. వార్తలు రాసే జర్నలిస్టులను కూడా ఎమ్మెల్యే తిట్టడం అప్రజాస్వామికమని, ఎమ్మెల్యే కవ్వంపల్లి సారథ్యంలో అతడి "చెడ్డి గ్యాంగ్" దాడులకు తెగబడుతోందని ఆరోపణలు చేశారు. తన ఇంటిపై దాడి చేసి, ఇంట్లో ఉన్న మనుషులపై హత్యాయత్నం చేశారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి చేసిన అభివృద్ధిపై దమ్ముంటే చర్చకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యేకు సంస్కారం ఉంటే, తక్షణమే పాత్రికేయుల సాక్షిగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఉల్టా కేసులు పెట్టి బెదిరించాలని చూస్తే బెదిరేది లేదని స్పష్టం చేశారు. గత రెండేళ్లలో ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి ఏంటో ప్రజలకు వివరించాలని, ఇప్పటికైనా తన వైఖరి మార్చుకోవాలని అన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి వ్యవహారశైలిని ప్రజలు క్షమించబోరని వ్యాఖ్యాత హెచ్చరించారు.

## సహకార సంఘ అక్రమాలపై జిల్లా సహకార అధికారికి ఫిర్యాదు..

**బలగం టీవీ, ఇల్లంతకుంట**



ఇల్లంతకుంట సహకార సంఘం లో ఖరీఫ్ 2021 సీజన్ నుండి ఖరీఫ్ 2024 వరకు సీజన్లలో సహకారసంఘం లో దాదాపు 95 లక్షల అక్రమాలు జరిగాయని సెంటర్ల నిర్వహణలో అవకతవకల్లో సంఘం సుమారు 95 లక్షల రూపాయల పైగా నష్టపోయిందని జిల్లా సహకార అధికారికి సంఘ సభ్యులు ఫిర్యాదు చేయడం జరిగిందని సంఘ సభ్యులు తెలిపారు.. దీనిపై సత్వరమే విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఫిర్యాదు అందించారు. దీనికి స్పందించిన జిల్లా సహకార అధికారి పూర్తిస్థాయిలో విచారణ చేసి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ పాలకవర్గ సభ్యులు చల్ల నవీన్ రెడ్డి గన్నెరం వసంత నర్సయ్య , మాజీ పాలకవర్గ సభ్యులు నాయని నవీన్ కుమార్ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ బాధ్యతగ మొక్కలు నాటుదాం..

- పుడమి తల్లి పచ్చదనాన్ని కాపాడుదాం..
- ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మంజుల

**బలగం టీవీ, ఆలేరు**



యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పత్తిపాటి మంజుల మాట్లాడుతూ:అత్యద్భుత సుందర సుమనోహరదృశ్య కావ్యానికి నిదర్శనం ప్రకృతి, కాని మన స్వార్ధ పూరిత విధానాలతో ప్రకృతిని నాశనం చేస్తున్నాం.అడవులన్నీ హరించకపోయి వెంచర్లయి అయిపొయినాయి అని అన్నారు. అడవులు విస్తీర్ణం నానాటికీ తగ్గిపోతుండటంతో జంతువులకు ఆహారం దొరక్క జనావాసాల్లోకి వస్తున్నాయి. పంటలు అన్ని నష్టం చేస్తున్నాయి అని అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా రద్దుచేయాలని,పుడమి తల్లి పచ్చదనాన్ని కాపాడుతూ చక్కని ఆకృతుకై శ్రమిద్దాం అని పిలుపునిచ్చారు.బరువనుకోక ప్రతి ఒక్కరూ బాధ్యతగ మొక్కలు నాటుదాం అని పిలుపునిచ్చారు.

# మాస్ మహారాజా మళ్ళీ మాస్ మోడ్‌లో

- 'మాస్ జాతర' ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

మాస్ మహారాజా రవితేజ అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న 'మాస్ జతర' ట్రైలర్ ఎట్టకేలకు విడుదలైంది. రవితేజ అంటేనే ఎనర్జీ, మాస్, పంచ్‌ల మేళవింపు ు అదే ఉత్సాహం, ఆ రవితేజ మార్క్ ఎనర్జీతో నిండిపోయింది ఈ ట్రైలర్.

రైల్వే పోలీస్ అధికారిగా రవితేజ కనిపించే తీరు అభిమానుల్లో హుషారును నింపింది. ఆయన డైలాగ్ డెలివరీ, బాడీ లాంగ్వేజ్, ఫైట్ సీక్వెన్స్‌లు చూసినవారు "ఇదే వింటేజ్ రవితేజ!" అని అంటున్నారు. కథానాయకుడు%–%ప్రతినాయకుడి మధ్య ఉత్కంఠభరితమైన పోరాటం ఈ ట్రైలర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

శక్తివంతమైన ప్రతినాయక పాత్రలో నవీన్ చంద్ర మరోసారి మెప్పించాడు. కథానాయిక




శ్రీలీల శ్రీకాకుళం యాసలో మాట్లాడటం, ఆమె తెరపై అందం ట్రైలర్‌కు కొత్త లుక్ ఇచ్చాయి. రవితేజ శ్రీలీల ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ సూపర్‌హిట్ జోడీగా చెప్పుకోవచ్చు. ఇప్పటికే పాటలతో హైప్ క్రియేట్ చేసిన భీమ్స్ సిసిరోలియో, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌తో ట్రైలర్‌ను మరో లెవల్‌కి తీసుకెళ్లాడు. భారీ ఫైట్స్, మాస్ డైలాగ్స్, పంచ్‌లతో పాటు నవ్వించే హాస్యం కూడా పుష్కలంగా ఉంది.

'మాస్ జతర' చిత్రానికి రచయితగా గుర్తింపు తెచ్చుకున్న భాను భోగవరపు దర్శకుడిగా మారారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్%–%ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పూర్తి స్థాయి వాణిజ్య వినోదానికి హామీ ఇస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 31న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. అభిమానులు "ఇదే అసలైన రవితేజ ఫెస్టివల్!" అంటూ సోషల్ మీడియాలో సంబరాలు జరుపుతున్నారు.

# విండీస్‌కు టీ20 సిరీస్‌లో శుభారంభం

- బంగ్లాదేశ్‌పై 16 పరుగుల తేడాతో విజయం
- షై హెూప్, పావెల్ దూకుడు

**బలగం టీవీ, హైదరాబాద్**

బంగ్లాదేశ్‌తో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు వెస్టిండీస్ విజయవంతమైన ఆరంభం చేసింది. సోమవారం జరిగిన తొలి టీ20లో విండీస్ 16 పరుగుల తేడాతో విజయం సాధించి, సిరీస్‌లో 1–0 ఆధిక్యం సాధించింది.

**హెూప్, పావెల్ మెరుపులు**

ముందుగా బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ జట్టు, కెప్టెన్ షై హెూప్ (46 నాటౌట్), రొవ్మన్ పావెల్ (44 నాటౌట్) చెలరేగి ఆడటంతో 20 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 165 పరుగులు చేసింది. ఇద్దరి మధ్య కీలక భాగస్వామ్యం విండీస్ స్కోరును రాణింపజేసింది.

**బంగ్లా ప్రతిఘటన విఫలం**

ఛేదనలో బంగ్లాదేశ్ బ్యాటర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు.




విండీస్ బౌలర్ల దాడి ఎదుర్కోలేక 19.4 ఓవర్లలో 149 పరుగులకే ఆలౌట్ అయ్యారు. దాంతో విండీస్ 16 పరుగుల తేడాతో మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. రెండో టీ20 అక్టోబర్ 29న ఢాకా వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్ విండీస్‌కు సిరీస్ ఖాయం చేసే అవకాశం కాగా, బంగ్లాదేశ్ తిరిగి పోరాడి సమం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# కాకినాడకు రెడ్ అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరికలు జారీ చేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అంతర్వేది వద్ద 500 మీటర్ల మేర సముద్రం వెనక్కి వెళ్లింది. కాకినాడ–ఉప్పాడ బీచ్ రోడ్డుపై రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలోని బర్రా గుహలను, డుంబ్రిగుడ మండలంలోని చాపరాయి జలపాతాన్ని, ఇతర పర్యాటక ప్రాంతాలను అధికారులు మూసేశారు. ఢిల్లీ నుంచి విశాఖకు రావాల్సిన ఇండిగో విమానాన్ని సోమవారం ఉదయమే దారి మళ్లించారు. మంగళవారం దాదాపు ఇండిగో, ఎయిర్ ఇండియా విమానాలన్నింటినీ అధికారులు రద్దు చేశారు. విశాఖ మీదుగా నడిచే 29 రైళ్లను రద్దు చేశారు. శ్రీకాకుళంలో జిల్లా గారలో అత్యధికంగా 52 మి.మీ వర్షం కురిసింది. కంచిలిలో అత్యల్పంగా 1.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

కాకినాడలో ముంపు ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేరవేసేందుకు 40 బోట్లను, వంద మంది సిబ్బందిని, 140 గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. 50 మందితో ఎస్‌డిఆర్‌ఎఫ్, 30 మందితో ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు ఇప్పటికే కాకినాడకు చేరుకున్నాయి. జిల్లాలో 269 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రతి కేంద్రానికి ఇన్‌ఛార్జులను నియమించారు. ఈ నెల 31 వరకూ విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. కాకినాడ జిల్లాలో ఆరు వేల ఎకరాలు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 7,500 ఎకరాలు, తూర్పు గోదావరి జిల్లాలో 2,500 ఎకరాల్లో వరి పంట ముంపునకు గురైనట్టు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.

విశాఖలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో విశాఖలో 12,755 ఇళ్లు కొండవాలు ప్రాంతాల్లో ఉండగా వాటిలో 96 ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నట్టు గుర్తించి అక్కడి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 20 సైక్లోన్ షెల్టర్లు, 23 పునరావాస కేంద్రాలకు సుమారు తొమ్మిది వేల మందిని తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. నక్కపల్లి మండలంలోని తీరగ్రామాల్లో తొమ్మిది పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి భోజన, వసతి సదుపాయాలు కల్పించారు. పశ్చిమగోదావరి జిల్లాలో 16 పునరావాస కేంద్రాలు, 26 పక్కా భవనాలు పునరావాసానికి సిద్ధం చేశారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని గరాలదిబ్బ, గిలకలదిండి గ్రామాలు, పామర్రు, నందివాడ,గుడివాడ, బంటుమిల్లి మండలాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను అధికారులు పరిశీలించి, సదుపాయాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరులో సోమవారం సాయంత్రం నుంచి మోస్తరు వర్షం కురిసింది.

ఎగువున కురుస్తున్న వర్షాలతో ఏలేరు రిజర్వాయర్‌కు వరద నీరు పోటెత్తుతోంది. 24 టిఎంసిల సామర్థ్యం గల ఈ ప్రాజెక్టులో ప్రస్తుతం 22 టిఎంసిలు నమోదయ్యాయి. సామర్లకోటాపిఠాపురం రోడ్డులో ఉన్న పెద్ద ఏలేరు బ్రిడ్జి వద్ద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద నీటిని మరింత కిందకు వదిలితే 30 వేల ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు.

తిరుపతి జిల్లా వరదయ్యపాళెం మండలానికి చెందిన ఇరిగేషన్ శాఖ ఎఇ బాబు తన కారు కడిగేందుకు కారు డ్రైవర్ షరీఫ్ అలియాస్ చిట్టి (40), మనవడు మహిత్ (6)తో కలిసి ఉబ్బలమడుగు సమీపంలోని తెలుగుగంగ కాలువ వద్దకు ఆదివారం వెళ్లారు. కారు కడుగుతుండగా మహిత్ కాలుజారి కాలువలో పడిపోయారు. బాలుడిని కాపాడేందుకు కాలువలోకి దూకిన బాబు నీటి ప్రవాహానికి కొట్టుకు పోయారు. వారిద్దరిని కాపాడేందుకు షరీఫ్ కూడా కాలువలోకి దూకాడు. చెట్టుకొమ్మకు వేలాడుతున్న బాబును స్థానిక మత్స్యకారులు గమనించి కాపాడారు. గల్లంతైన షరీఫ్, మహిత్‌ల కోసం పోలీసులు గాలించగా సోమవారం మహిత్ మృతదేహం లభించింది. షరీఫ్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## 'బ్యాడ్‌బాయ్ కార్తీక్'లో మైమరిపించే 'అందమైన ఫిగరు నువ్వా' పాట విడుదల

**బలగం టీవీ, హైదరాబాద**

నాగశౌర్య కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బ్యాడ్‌బాయ్ కార్తీక్' చిత్రంలోని కొత్త పాట 'అందమైన ఫిగరు నువ్వా' సోమవారం విడుదలైంది. రామ్ దేశిన దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీనివాసరావు చింతలపూడి నిర్మిస్తున్నారు. శ్రీవైష్ణవి ఫిల్మ్స్ పతాకంపై రూపొందుతున్న ఈ సినిమాలో హీరో నాగశౌర్య, హీరోయిన్ విధిల మధ్య కనిపించే కెమిస్ట్రీ ఈ పాటలో ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంది.ఈ పాటకు హారిస్ జైరాజ్ సంగీతం అందించగా, కృష్ణకాంత్ సాహిత్యం రాశారు. గాయకులు శ్రీధర్ సేన, ప్రియా జెర్సన్ తమ స్వరాలతో ఈ మెలోడీకి మరో మాధుర్యాన్ని జోడించారు. త్వరలోనే సినిమాను విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.







# సెమీఫైనల్ ముందు టీమిండియాకు షాక్!

- స్టార్ ఓపెనర్ ప్రతీక రావల్ గాయంతో వరల్డ్ కప్‌కు దూరం
- షఫాలీ వర్మ జట్టులోకి రీ-ఎంట్రీ

**బలగం టీవీ, హైదరాబాద్**

స్వదేశంలో జరుగుతున్న మహిళల వన్డే వరల్డ్ కప్‌లో టీమిండియాకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఫామ్‌లో ఉన్న స్టార్ ఓపెనర్ ప్రతీక రావల్ గాయంతో సెమీఫైనల్ మ్యాచ్‌కు దూరమైంది. ఆమె స్థానంలో అనుభవజ్ఞురాలు షఫాలీ వర్మ జట్టులోకి రాబోతున్నట్లు బీసీసీఐ వర్గాలు ప్రకటించాయి. గత సంవత్సరం వన్డే జట్టులోనుండి వెళ్లిన షఫాలీ, సుమారు ఏడాది తరువాత తిరిగి ఆడే అవకాశం పొందడం గమనార్హం.

గ్రూప్ దశలో ఆదివారం జరిగిన భారత్%–%బంగ్లాదేశ్ మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా ప్రతీక కుడి కాలికి తీవ్ర గాయమైంది. తక్షణమే ఆమెను వైద్య పరీక్షల నిమిత్తం దవాఖానాకు తరలించగా, ప్రస్తుతం చికిత్స పొందుతోందని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ప్రతీక గాయంతో జట్టు లయ దెబ్బతినే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

ఈ టోర్నీలో ఇప్పటివరకు ప్రతీక ఆరు ఇన్నింగ్స్‌ల్లో 308 పరుగులు చేసి, సగటుగా 51.33 రన్స్ సాధించింది. ఆమె ఇన్నింగ్స్‌లలో మూడు హాఫ్ సెంచరీలు నమోదు చేసింది. భారత జట్టుకు ఆరంభంలో దూకుడు అందించే ఓపెనర్‌గా ఆమె ప్రదర్శన కీలకమైంది. భారత జట్టు గురువారం ఆస్ట్రేలియాతో సెమీఫైనల్ పోరులో తలపడనుంది. ప్రతీక స్థానంలో వచ్చే షఫాలీ వర్మకు ఇది తనను తిరిగి నిరూపించుకునే గొప్ప అవకాశంగా మారనుంది.

# భారత్ పర్యటనకు సౌతాఫ్రికా జట్టు ప్రకటన

- కెప్టెన్‌గా టెంబా బవుమా రీఎంట్రీ
- రెండు టెస్టుల సిరీస్‌కు బరిలోకి సిద్ధమైన ప్రోటీస్

**బలగం టీవీ, జొహానెస్‌బర్గ్**




భారత్ పర్యటనకు రానున్న రెండు టెస్టల సిరీస్ కోసం సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు సోమవారం 15 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. పాకిస్థాన్ పర్యటనకు దూరంగా ఉన్న కెప్టెన్ టెంబా బవుమా ఈసారి జట్టులోకి తిరిగి చేరి, సారథ్య బాధ్యతలు స్వీకరించనున్నాడు.

పాకిస్థాన్‌తో ఆడిన ఆటగాళ్లలో మెజార్టీకి ఈ జట్టులో మళ్ళీ అవకాశం లభించింది. కార్బిన్ బాష్, డెవాల్డ్ బ్రెవిస్, టోనీ, డీ జోర్జి, జుబేర్ హంజా, సైమన్ హర్మర్, మార్కో యాన్సెన్, కేశవ మహరాజ్, ఎయిడెన్ మార్క్‌రమ్, వియాన్ ముల్డర్, సెనురన్ ముత్తుసామి, కగిసో రబడా, ర్యాన్ రికెల్టన్, ట్రిస్టన్ స్టబ్స్, కైల్ వెరినె లు జట్టులో చోటు దక్కించుకున్నారు.

**టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో కీలక సిరీస్**

వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025%–%27 ఎడిషన్‌లో భాగంగా ఈ సిరీస్ జరగనుంది.

సొంతగడ్డపై సిరీస్‌లు గెలిస్తేనే ఫైనల్ అవకాశాలు బలోపేతం అవుతాయని భారత జట్టు భావిస్తోంది. మొదటి రెండు ఎడిషన్లలో ఫైనల్ చేరి తృటిలో టైటిల్ చేజార్చుకున్న భారత్, గత ఎడిషన్‌లో మాత్రం ఫైనల్ బెర్త్‌ను కోల్పోయింది. ఇదే సమయంలో సౌతాఫ్రికా ఆ ఎడిషన్‌లో చాంపియన్‌గా నిలిచింది.

**పర్యటన షెడ్యూల్**


సౌతాఫ్రికా నవంబర్ 14న కోల్‌కతా వేదికగా తొలి టెస్ట్, నవంబర్ 22న గువాహటి వేదికగా రెండో టెస్ట్ ఆడనుంది. ఈ సిరీస్ కోసం భారత జట్టు ఇంకా ప్రకటించలేదు. వెస్టిండీస్‌తో ఆడిన జట్టునే దాదాపు కొనసాగించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

**సౌతాఫ్రికా టెస్ట్ జట్టు**

టెంబా బవుమా (కెప్టెన్), కార్బిన్ బాష్, డెవాల్డ్ బ్రెవిస్, టోనీ, డీ జోర్జి, జుబేర్ హంజా, సైమన్ హర్మర్, మార్కో యాన్సెన్, కేశవ మహరాజ్, ఎయిడెన్ మార్క్‌రమ్, వియాన్ ముల్డర్, సెనురన్ ముత్తుసామి, కగిసో రబడా, ర్యాన్ రికెల్టన్, ట్రిస్టన్ స్టబ్స్, కైల్ వెరినె.

## థ్రిల్లర్‌గా రాబోతున్న అల్లరి నరేష్ '12ఏ రైల్వే కాలనీ'

**బలగం టీవీ, హైదరాబాద్**




అల్లరి నరేష్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న థ్రిల్లర్ చిత్రం '12ఎ రైల్వే కాలనీ' విడుదలకు సిద్ధమైంది. నవంబర్ 21న ఈ చిత్రం థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రానుంది. 'పొలిమేర', 'పొలిమేర 2' చిత్రాల దర్శకుడు డా. అనిల్ విశ్వనాథ్ ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు అందించారు. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని పవన్ కుమార్ సమర్పిస్తున్నారు. ఈ సినిమాతో నాని కాసరగడ్డ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఎడిటింగ్ బాధ్యతలను కూడా ఆయనే స్వయంగా చేపట్టారు. కథానాయికగా డా. కామాక్షి భాస్కర్ల నటిస్తున్నారు.సినిమాలో సాయి కుమార్, వైవా హర్ష, గెటప్ శ్రీను, సద్దాం, జీవన్ కుమార్, గగన్ విహారి, అనీష్ కురువిల్లా, మధుమణి తదితరులు ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. థ్రిల్లర్, సస్పెన్స్ అంశాలతో నిండిన ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనున్నదని చిత్రబృందం చెబుతోంది.